సమాచారం

దుర్గం చెరువు ప్రవేశం ఫీజు వ్యక్తికి : రూ.10
- పిల్లలకు రూ.5
- నెలసరి వాకర్స్ పాస్ రూ.200
- సంవత్సర వాకర్స్ పాస్ రూ. 2000
- సీనియర్ సిటిజన్స్ వాకర్స్ పాస్ రూ. 800
- స్టిల్ కెమెరా ఫొటోషూట్ రూ. 250, (పర్ డే)
- వీడియో కెమెరా షూటింగ్ రూ.5000 (పర్‌డే)
- ఫిల్మ్ షూటింగ్ రూ. 25,000 (పర్‌డే)

మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్
- రోజుకు 4 షోలు.. రాత్రి 7గంటల నుంచి 10 గంటల మధ్యలో..
- 7 పాటలకు దాదాపు 30 నిమిషాల పాటు ఒక షో.
- 20 మీటర్ల ఎత్తు , 60 మీటర్ల పొడవుతో రంగురంగుల డిజైన్‌లతో ఫౌంటేన్ అందాలు
- ఆకట్టుకుంటున్న చిన్నారుల పార్కు, వాటర్ ఫౌంటేన్, లవ్ సింబల్ ఆకృతులు
- వాకింగ్ చేసేందుకు 4.2 కిలోమీటర్ ట్రాక్

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలపై...

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులు తెలువచ్చని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏఈ శ్రీనివాస్‌రెడ్డి : 8985564919
ఫ్యూజ్ ఆఫ్ కాల్ : 8985177810
లైన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు : 9948123155 (పీజేఆర్, కెఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్, శ్రీరాంనగర్, ఓల్డ్ బాంబే రోడ్డు)
లైన్ ఇన్‌స్పెక్టర్ జీవన్ : 9393877007 (శంకర్‌నగర్, రెడ్డి కాలనీ, సురక్ష ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి, కాలనీ, దీప్తిశ్రీనగర్)
ఏఎల్‌ఎం వెంకటేష్ (దీప్తిశ్రీనగర్ ఏరియా) :9989185419
ఏఎల్‌ఎం రమేష్ (పీజేఆర్, కెఎస్‌ఆర్ ఏరియా) : 9700905903
ఆర్టిసన్ రమేష్ (రాజేందర్‌రెడ్డి నగర్, విద్యానగర్) : 9177772323
ఆర్టిసన్ కుమార్ (ఫ్రెండ్స్ కాలనీ): 9553614407

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 55 , బెండ 40, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 30, చామ 60, కీర 20, బీర 50, వంకాయ 30, గోకర 60, బీన్స్ 70, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 15, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్ (1) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

నేడు చిన్నారుల ఆధార్ నమోదు

ఆల్విన్‌కాలనీ: దీనబంధు కాలనీ కమిటీ హాలులో అంగన్‌వాడీ టీచర్‌ల ఆధ్వర్యంలో 9వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు 0– 5 సంవత్సరాల చిన్నారులకు ఆధార్‌కార్డు సెంటర్ ఒక్క రోజు మాత్రమే ఏర్పాటు చేసినట్లు అంగన్‌వాడీ టీచర్ దుత్తలూరి దస్తగిరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని దీనబంధు కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక పూజలు

మియాపూర్: ఓల్డ్ మియాపూర్ గ్రామంలో శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి 108 కలశాలతో అభిషేకం, సింధూర అలంకరణ చేశారు. పూజా కార్యక్రమానికి మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్ హాజరయ్యారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ కౌన్సిలర్ రాంచందర్ ముదిరాజ్, ఓం ప్రకాష్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, నాగేశ్వర్‌గౌడ్, మహేందర్ ముదిరాజ్ తదితరులున్నారు.

ఘన నివాళి

రాయదుర్గం: మౌంట్ ఆబూలో బ్రహ్మకుమారీస్ గ్లోబల్ సెంటర్ల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ రాజయోగిని దీదీ రతన్‌మోహిని మంగళవారం ఉదయం మృతి చెందారు. దీంతో గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతి చెందిన విషయం తెలియగానే శాంతిసరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ బెహన్ దీదీ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు ఘన నివాళులు అర్పించారు.

బస్సులో బంగారు నగలు మాయం కేసు విచారణ ముమ్మరం

చందానగర్: చందానగర్‌లో బస్సులో రూ.2లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు మాయమైన ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసిన నేపథ్యంలో మంగళవారం విచారణ ముమ్మరం చేసినట్లు డీఐ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో నివాసముండే కోదండ రెడ్డి, భార్య స్వప్న, కుమారుడు స్వగ్రామమైన కడపకు వెళ్ళి తిరిగి బస్సులో వస్తున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులో సుమారు రూ.2లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్నాయి. లగేజీ ర్యాక్‌లో ఉంచారు. సోమవారం ఉదయం చందానగర్‌లో దిగి బ్యాగ్ చూడగా బంగారు ఆభరణాలు మాయమైనట్లు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న డీఐ బస్సు డ్రైవర్, కండక్టర్‌లను విచారిస్తున్నామన్నారు.

బస్తీ దవాఖానాకు దారేదీ...?



ప్రధాన గేటు ముందు వాహనాల అక్రమ పార్కింగ్

చందానగర్: బస్తీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసింది. కానీ అవసరమైన వసతులు కల్పించ లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు దవాఖానా గేటు ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో దారి లేక ఇబ్బందిపడుతున్నారు. ఇక ఖాళీ స్థలంలో మట్టి చెత్త వేస్తున్నారు. కొండాపూర్ డివిజన్ పరిధి న్యూహఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్ బస్తీలో కమ్యూనిటీ హాల్ కోసం నిర్మించిన భవనాన్ని బస్తీ దవాఖానగా మార్చారు. ఐతే ఈ దవాఖానలో వైద్యులు, రోగులకు కావలసిన కనీస వసతులు కల్పించలేదు. మంచినీటి సౌకర్యం, పారిశుధ్యంపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ



కూలిన ప్రహరీ గోడ



కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బస్తీ దవాఖానా

దవాఖానాలో ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు రోజు బస్తీ దవాఖానాను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు ఇవే..
- బస్తీ దవాఖాన ప్రధాన గేటు ముందు వాహనాలు నిలుపుతుండడంతో రోగులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.
- మంచినీటి పైప్‌లైన్ వసతి లేకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీళ్ళు అందిస్తున్నారు.
- భవనం ప్రహరీ గోడ కూలిపోయింది. దవాఖాన పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది
- మరుగుదొడ్లు ఉన్నా అవి నిరుపయోగంగా మారాయి.

కనీస వసతులు కల్పించాలి



బస్తీ దవాఖానాలో కనీస వసతులు కల్పించాలి. ప్రజాప్రతినిధులు దవాఖానా అభివృద్ధి కోసం నిధులు మంజూరు అయ్యాయంటున్నారు. నిధులు మంజూరైన నేపథ్యంలో ప్రహరీగోడ పనులు తక్షణమే ప్రారంభించాలి. మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలి.

– రాజు, బస్తీవాసి

పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలి



బస్తీ దవాఖాన ప్రధాన గేటు ముందు ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతున్నారు. రోగుల రాకపోకలకు ఇబ్బందికలుగుతోంది. గేటు నుంచి కాకుండా కూలిన ప్రహరీ గోడపై నుంచి దవాఖానా లోపలకు వస్తున్నారు.

–హరిబాబు, ప్రేమ్‌నగర్‌వాసి

విద్యార్థులకు షూలు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నైబర్ హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు కవిత, రామ్మూర్తి, రవి రమణలు మాట్లాడుతూ దాతల సహకారంతో 560 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఏటా వేసవిలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు.



విద్యార్థులకు షూలు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సీనియర్ నాయకుడు శంకర్‌గౌడ్ మృతి



శంకర్‌గౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు కొమరగాని శంకర్‌గౌడ్(71) మృతి చెందారు. మంగళవారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా ఆయన తెలంగాణ ఉద్యమంలో పని చేశారు. పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. పలువురు నివాళులు అర్పించారు.

ప్రమాదకరంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్



ప్రశాంత్‌నగర్ ఆర్‌టీసీ బస్సు టెర్మినల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్సు టెర్మినల్ వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలేకుండా ప్రమాదకరంగా ఉంది. బస్ టెర్మినల్‌లోకి నిత్యం బస్సులు ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తుంటాయి. బస్ లోపలికి వెళ్లే సమయంలో మలుపు చాలా ఇబ్బందిగా ఉంటుంది. మ్యాన్‌హోల్‌లో టైరు పడితే వాహనం నిలిచిపోవడమే కాక రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతుంది. నెల రోజులుగా సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు. అంతేకాక టెర్మినల్ భవనంలోనే కూకట్‌పల్లి డిపో మేనేజర్, డిపో ఆర్ఎంలు ఉంటారు. వారికి ఈ సమస్య కనిపించడంలేదా అని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు చోటు చేసుకోక ముందే అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

9 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 9 మంది పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ. 2 వేల జరిమానా, ఐదుగురికి రూ .1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

జూనియర్ కళాశాలకు భవనం నిర్మించండి

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించాలని కోరుతూ మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎంతో మంది పేద విద్యార్థులు కొన్నేళ్లుగా రేకుల షెడ్డు కింద చదువుకుంటున్నట్లు తెలియడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే కళాశాలను పరిశీలించి భవన నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు .



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య

ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న యువకుడి అరెస్టు

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ యువకుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగ్ జోరుగా సాగుతున్నదని సమాచారం అందింది. దాంతో ఎస్ఐ అవినాష్ తదితర సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీ రాత్రి వెంగళరావునగర్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని గుర్తించి అదుపులోనికి తీసుకున్నారు. నిందితుడు పెద్దపల్లి ప్రాంతానికి చెందిన ఎస్.ఉదయ్‌గా గుర్తించారు. ప్రైవేట్ జాబ్ చేస్తూ గత కొంతకాలంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లుగా పోలీసుల విచారణలో తెలియజేశాడు. దాంతో అతనిని అదుపులోనికి తీసుకుని అతని వద్ద ఉన్న ఫోన్, రూ. 2708ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూలో విద్యార్థుల నిరసన



హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు మంగళవారం నిరసన తెలిపారు. హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు విద్యార్థి సంఘం 2024–25 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో పలు విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నినాదాలు చేశారు. కాగా క్యాంపస్‌లో నిరసన సందర్భంగా నమోదు చేసిన కేసులను ప్రభుత్వం ప్రకటించినట్లుగానే వెంటనే ఉపసంహరించాలని, రిమాండ్‌లో ఉన్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ హెచ్‌సీయూ భూములపై పోరాటం కొనసాగుతుందన్నారు.

రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తా..

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్ కాలనీలోని సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కాలనీవాసులతో కలిసి మంగళవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా రాంనరేష్ కాలనీవాసులు మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీ , మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, త్వరలో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలీ తలాబ్ చెరువును అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



అలీతలాబ్ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

సన్మానం

గచ్చిబౌలి: బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వానిపల్లి శ్రీనివాస్‌రెడ్డిని శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శేరిలింగంపల్లి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎల్బీనగర్ వనస్థలిపురం ఎంఈ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించిన నాయకులు రవికుమార్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

కొనసాగుతున్న మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్

బంజారాహిల్స్: మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు. మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్ రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు చోట్ల తనిఖీలు చేపట్టారు. మైనర్లు వాహనం నడుపుతూ చిక్కితే వాహన యజమానిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. న్యాయస్థానంలో జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని, సదరు వాహన రిజిస్ట్రేషన్‌ను కూడా ఏడాది పాటు సస్పెండ్ చేస్తారన్నారు. అంతేకాకుండా సదరు మైనర్‌కు పాతికేళ్ల వయస్సు వచ్చేదాకా డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత ఉండదన్నారు. ఈ కఠిన నిబంధన నేపథ్యంలో మైనర్లకు వాహనం ఇచ్చే ముందు తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రత్యేక తనిఖీల్లో రోజూ తమ పోలీసులు తనిఖీలు చేపడుతున్నారన్నారు. మైనర్లు వాహనం నడిపితే వాహనాలను అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్‌తో కలిసి ఆయన మంగళవారం శ్రీనగర్‌కాలనీ టి-జంక్షన్‌లో తనిఖీల్లో పాల్గొన్నారు.



వాహనదారునికి కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

వ్యర్థాలతో నిండిన ఎంజీనగర్ నాలా



చెత్తతో నిండిన ఫిలింనగర్‌లోని నాలా

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ నాలా చెత్తాచెదారంతో పాటు వ్యర్థాలు, బురదతో నిండిపోయింది. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే ఈ బస్తీలో భారీ నాలా ఉండగా గత కొన్ని నెలలుగా ఇది పూర్తిగా నిండిపోయి స్థానికులకు నరకాన్ని చూపిస్తున్నది. డీసిల్టింగ్ చేయాల్సిన ఇంజనీరింగ్ విభాగం ఆ దిశగా ఇంకా చర్యలు చేపట్టలేదు. ఫలితంగా బస్తీవాసులు దుర్వాసనతో నరకాన్ని చవిచూస్తున్నారు. దీని ప్రభావం బీజేఆర్‌నగర్, అంబేద్కర్‌నగర్, మహాత్మాగాంధీనగర్, బసవతారకనగర్, హకీంపేట కుంట ప్రాంత నివాసితులపై తీవ్రంగా చూపుతోంది. దోమల స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీసిల్టింగ్ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కబ్జాకోరల్లో బుల్కాపూర్ నాలా

- యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణలు
- ఓ వైపు హైడ్రా సర్వే.. మరోవైపు కబ్జాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

మణికొండ: అది చరిత్రాత్మక బుల్కాపూర్ నాలా.. దాన్ని పరిరక్షించటం, పునరుద్ధరించేందుకు ఓ వైపు హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు కృషి చేస్తున్నారు. ఇటీవలే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆ నాలాను పరిశీలించి దాని బఫర్ జోన్‌లో వేసిన రేకుల ప్రహరీలను తొలగింప చేశారు. అవన్నీ పట్టించుకోకుండా ఏకంగా నాలాపైనే ఆక్రమణలు వస్తున్నా స్థానికంగా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదు. అధికారుల తీరుపై స్థానికులు సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మణికొండ మున్సిపాలిటీ బీరప్ప దేవాలయం నుంచి పంచవటి కాలనీ వరకు ఉన్న బుల్కాపూర్ నాలా క్రమంగా అన్యాక్రాంతం అవుతుందని స్థానికులు వాపోతున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినపుడు నామమాత్రంగా కూల్చివేతలు చేపట్టి తరువాత పట్టించుకోకపోవటం షరామామూలవుతోంది. రోజూ పలు ఆక్రమణలు వస్తున్నాయని వారు పేర్కొంటున్నారు.
- మర్రిచెట్టు సర్కిల్ వద్ద నాలాను పూర్తిగా పూడ్చి ఓ భవన యజమాని ఏకంగా పార్కింగ్ స్థలంగా వాడుకోవటం, దాని తరువాత ఓ వైన్స్ నిర్వాహకులు నాలాను పూర్తిగా పూడ్చి పార్కింగ్ స్థలంగా మార్చివేశారు.
- ఆర్టీఏ కార్యాలయం సమీపంలో ఏకంగా నాలాపై హోటల్‌లు, డబ్బాలు వెలుస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- మణికొండ మున్సిపాలిటీకి వచ్చే ప్రధాన రోడ్డయిన ఓయూ కాలనీ నుంచి మర్రి చెట్టు సర్కిల్ వరకు నాలాను ఆక్రమించి షాపులు, హోటల్‌లు వెలవటం వాటిని చూసిన వారు ఇదేమి మున్సిపాలిటీ అని విస్తుపోతున్నారు.
- ఇదే తరహాలో షేక్‌పేట నుంచి నార్సింగి ప్రధాన దారిలోను గండిపేట క్యాండూట్ కింద ఆక్రమణలు వచ్చి కళావిహీనంగా మున్సిపాలిటీ ప్రవేశాలు ఉన్నాయని కొత్తగా వచ్చే వారు అంటున్నారు. వాటిని తొలగించి మొక్కలు పెట్టి పార్కులా, వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేస్తే మున్సిపాలిటీ కేంద్రానికి మరింత శోభ చేకూరుతుందని పలువురు సూచిస్తున్నారు.
- మర్రిచెట్టు సర్కిల్ వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేస్తే ఎంతో మందికి ఉపయోగపడుతుందని వారు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి బుల్కాపూర్ నాలా ప్రాంతాన్ని పరిరక్షించటంతో పాటు తీర్చిదిద్దాలని కోరుతున్నారు.



బుల్కాపూర్ నాలాపై కొత్తగా ఏర్పాటు చేస్తున్న షాపులు



నాలాపై వెలసిన ఆక్రమణలు